# కన్నీటి భాష

"అమ్మా! ఆ పిల్లలు చూడు ఎలా ఆడుకుంటున్నారో... నాకూ వాళ్ళలా పరుగెత్తి ఆడుకోవాలని ఉందమ్మా" అంది ఐదేళ్ళ జాస్మిన్.

కేరళలోని కొట్టాయంలో ఓ పార్కులో ఉన్న సిమెంట్ బెంచీమీద కూచుని ఉన్నారిద్దరూ. దూరంగా పిల్లలు కేరింతలుకొడ్తూ ఆడుకుంటున్నారు. పరుగెత్తి పట్టుకునే ఆట... బంతితో కొంత మంది, రింగుతో కొంతమంది... ఆడుకుంటున్నారు. మరికొంత మంది పిల్లలు ఉయ్యాలలూగుతున్నారు. యింకొంతమంది జారుడుబల్ల మీద జర్రునజారి మళ్ళా వేగంగా నిచ్చెనెక్కుతున్నారు.

అందంగా పెంచిన పూల మొక్కలు... రకరకాల జంతువుల ఆకారాల్లో కత్తిరించిన క్రోటన్ మొక్కలు... పల్లీలుతింటూనో, ఐస్ క్రీం తింటూనో చెట్ల కింద కూచుని కబుర్లు చెప్పుకుంటున్న జంటలు... పిల్లల అరుపులు, నవ్వుల్తో అక్కడంతా కోలాహలంగా ఉంది.

నలభై ఆరేళ్ళ క్రిస్టీ కూతురి వైపు సాలోచనగా చూసింది. బెంచీకి ఓ పక్కగా పెట్టి ఉన్న చక్రాల కుర్చీ వైపు చూడగానే ఆమె మొహంలో నవ్వు వికసించింది.

"సరే. వాళ్ళతో పాటు పరుగెత్తాలి. అంతేగా" అంటూ కూతుర్ని చక్రాల కుర్చీలో కూచోబెట్టి "రెడీనా... గట్టిగా పట్టుకో" అంది. మరుక్షణం చిన్నపిల్లల్తో సమానంగా చక్రాల కుర్చీని నెట్టుకుంటూ పార్కు చుట్టూ పరుగెత్తింది. ఆ వేగానికి జాస్మిన్ ఓ పక్క భయంతో బిగుసుకు పోతూనే ఆనందంతో కేకలు పెట్టింది.

ఆయాసాన్ని తీర్చుకోడానికి క్రిస్టీ సిమెంటు బెంచీ మీద కూలబడి రొప్పుతూనే

అడిగింది "బావుందా తల్లీ."

జాస్మిన్ విశాలమైన కళ్ళలో రెండు నీటి సముద్రాలు మొలిచాయి. "నాకు పరుగెత్తాలని ఉందమ్మా... నాకాళ్ళతో. గాడ్ జీసస్ కి నామీద కోపం వచ్చి కాళ్ళు యిలా చేశాడా" తప్పులు చేస్తే దేవుడికి కోపం వచ్చి శిక్షిస్తాడని చర్చిలో విన్న మాటలు గుర్తొచ్చి అడిగింది.

క్రిస్టీకి ఏం చెప్పి ఆ పసి హృదయాన్ని సముదాయించాలో అర్థం కాలేదు. వయసు నలభై దాటిన విషయం... తనీ మధ్య బరువు పెరిగిన విషయం మర్చిపోయి పరుగెత్తటం వల్ల విపరీతమైన ఆయాసంగా ఉంది... నీరసంగా ఉంది... వూపిరి సరిపోవటంలేదు. అయినా లేచి కూతుర్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది.

"ఎవరన్నారు బేబీ నువ్వంటే గాడ్‌కి కోపమని. నా చిట్టి తల్లి అంటే జీసస్‌కి ఎంత ప్రేమో తెలుసా... అందుకే చూశావా నిన్నెంత అందంగా పుట్టించాడో... మల్లె పూవులా ఉన్నావనేగా నీకు జాస్మిన్ అని పేరు పెట్టింది..నీ కళ్ళు మందారపూలంత వెడల్పుగా ఉంటాయి తెలుసా... నువ్వు నాబంగారు కొండవి"

"మరి నీ బంగారు కొండ నడవలేదుగా"

క్రిస్టీ తన కూతుర్ని ఒళ్లో కూచోబెట్టుకుంది. "నీవు తిరగడానికి ఈ చక్రాల కుర్చీ ఉంది కదా... ప్రపంచంలో కాళ్ళు లేని వాళ్ళు చాలా మంది ఉంటారు. వాళ్ళకు పాపం చక్రాలకుర్చీ కూడా ఉండదు తెలుసా?"

"మరి ఏదైనా కావాలంటే ఏం చేస్తారు?"

"నేల మీద పాక్కుంటూ వెళ్తారు. చూశావా నువ్వెంత అదృష్టవంతురాలివో... నీకు అమ్మను నేనున్నాను. నీ కోసం ప్రాణం యిమ్మన్నా యిస్తాను. కాళ్ళులేని వాళ్ళలో కొంత మందికి అమ్మ కూడా ఉండదు తెలుసా... యిపుడర్థమైందా గాడ్ జీసస్ నీ విషయంలో ఎంత దయామయుడో"

జాస్మిన్ అమ్మ వైపు చూసి మల్లె పువ్వంత తెల్లగా నవ్వింది. ఆ పసి మనసుకి కొద్దికొద్దిగా అమ్మ చెప్పే విషయాలు అర్థమౌతున్నాయి.

* * *

ఆరో తరగతి పాసై జాస్మిన్ ఏడో తరగతిలో చేరింది. రోజూ ఎవరి సాయం లేకుండానే చక్రాల కుర్చీని తనే నడుపుకుంటూ స్కూలుకెళ్తుంది. బుద్ధిగా చదువుకుంటూ క్లాస్‌లో ఎప్పుడూ ఫస్టుండే జాస్మిన్ అంటే ఆ స్కూల్లో యిష్టపడని వాళ్ళు లేరు.

ఆ రోజు స్కూల్ నుండి రాగానే ఉదాసీనంగా ఉన్న కూతుర్ని చూసి కంగారు పడింది క్రిస్టీ.

"ఏమైంది తల్లీ... స్కూల్లోఎవరైనా ఏమైనా అన్నారా... అంటే చెప్పు. డ్యాడీకి చెప్పి కొట్టిద్దాం" అంది.

చిన్నప్పుడు ఎవరిమీదైనా కోపం వస్తే 'మా డ్యాడీకి చెప్పి బాగా తన్నిస్తా' అనేది జాస్మిన్. అమ్మ తన మాటల్ని అనుకరిస్తూ మాట్లాడేప్పటికి జాస్మిన్ నవ్వేసింది.

"నా తల్లి నవ్వితే రత్నాలు రాలినట్టే ఉంటుంది తెలుసా" కూతుర్ని ఉత్సాహపరిచే ఉద్దేశంతో అంది క్రిస్టీ. మరలా తనే "రత్నాలు కాదు... మల్లెపూలు రాలినట్టు.. పేరు జాస్మిన్ కదా" అంటూ నవ్వింది.

జాస్మిన్ మరలా దిగులుగా మొహం పెట్టి, "మమ్మీ... స్కూల్లో నన్ను ఏడ్పిస్తున్నారు" అంది.

క్రిస్టీకి బాగా కోపం వచ్చింది."రేపు నీతోపాటు నేనూ స్కూలుకొస్తాను. వాళ్ళెవరో చూపించు. దయలేని మనుషులు... మీ ప్రిన్సిపాల్‌కి కంప్లెయింట్ చేస్తాను. పిల్లలకు మేనర్స్ నేర్పాలికదా. శారీరికలోపం ఉన్న వాళ్ళని ఎగతాళి చేస్తే దేవుడు మెచ్చడు. నరకానికి పోతారు"

"అది కాదు మమ్మీ. మీ పేరెంట్స్ కలర్ నలుపైతే నువ్వింత తెల్లగా ఎలా పుట్టావు అని ఏడ్పిస్తున్నారు."

"ఓ అదా... నా చిన్నప్పుడు నల్లగా ఉన్నందుకు బోల్డు బాధపడేదాన్ని. చర్చికి వెళ్ళినపుడల్లా నన్ను తెల్లగా ఎందుకు పుట్టించలేదు దేవుడా అని అడిగేదాన్ని. అందుకే దేవుడికి నామీద దయకలిగి నీ అంత తెల్లటి కూతుర్ని నాకు ప్రసాదించాడు."

జాస్మిన్ అమ్మ వైపు తడికళ్ళతో చూస్తూ చెప్పింది "పది రోజుల క్రితం పిన్ని వాళ్ళ యింటికి వాళ్ళ పెద్దమ్మాయి పెళ్ళికెళ్ళాం చూడు. అక్కడ పిన్ని ఎవర్తోనో చెప్తుంటే విన్నా.

నేనింకెవరికో పుట్టే మీరు పెంచుకుంటున్నారట కదా. నిజమా మమ్మీ... నేను నీ కూతుర్ని కాదా మమ్మీ..."

క్రిస్టీ కూతురి పక్కన కూచుని తల నిమురుతూ చెప్పింది. "నువ్వు నాకూతురివే తల్లీ.. నాప్రాణం నువ్వు"

"నిజం చెప్పు మమ్మీ . జీసస్ మీద ప్రమాణం చేసి నిజం చెప్పు"

"సరే... చెప్తా విను. యింకొంత పెద్దయ్యాక చెప్పాలనుకున్నా. నీకు అర్థం చేసుకునేంత వయసొచ్చింది కాబట్టి యిపుడు చెప్పినా పర్లేదని చెప్తున్నా. నాకు నలభైయేళ్ళ వయసొచ్చినా పిల్లలుపుట్టలేదు. డాక్టర్లు నన్నూ, డ్యాడీని పరీక్షించి యింక పిల్లలు పుట్టరని తేల్చి చెప్పారు. ఎవర్నయినా దత్తత తీసుకుందామని అనుకుంటున్న తరుణంలో ఒంగోల్లోని ఆక్రయ్యు హాస్పిటల్లో నర్సుగా పన్చేస్తున్న మీ పిన్ని దగ్గరకు వెళ్ళాల్సిన పని పడింది. నేనూ మీ డ్యాడీ అక్కడ నాలుగు రోజులున్నాం. డాక్టర్‌గారి ఓపి రూం బయట ఎవరో ఆడపిల్లని వదిలేసి వెళ్ళిపోయారని... పాప చాలా చక్కగా ఉందని మీ పిన్ని చెప్పింది. మేము డాక్టర్ గార్ని కల్సుకుని ఆర్నెల్ల వయసున్న నిన్ను చూశాం. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారే... అలా నిన్ను చూడగానే ఎత్తుకుని గుండెలకు హత్తుకున్నాను. అనాథ శరణాలయానికి అప్పగించాలని యోచిస్తున్న డాక్టర్‌గారు మా అభ్యర్థనని మన్నించి నిన్ను మాకప్పగించారు"

జాస్మిన్ కొన్ని నిముషాల వరకూ మౌనంగా ఉండిపోయింది.

"నిజం తెల్సింది కాబట్టి నన్ను పరాయిగా చూస్తావేమో తల్లీ... నేను తట్టుకోలేను. నిన్ను కనకున్నా కడుపులో దాచుకుని పెంచుకుంటున్నా" కూతుర్ని చుట్టుకుని క్రిస్టీ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఎన్ని జన్మలకైనా నువ్వే నా అమ్మవి. కానీ మమ్మీ ..మా స్కూల్లో అమ్మ అంటే దేవుడితో సమానమని కదా చెప్పారు. అమ్మలందరూ నీలా ఉంటారు కాబట్టే అలా అంటారనుకునేదాన్ని. కన్నపిల్లల్ని పారేసిపోయే తల్లులు కూడా ఉంటారని యిప్పుడే తెల్సింది" అంది జాస్మిన్.

క్రిస్టీ ఏదో చెప్పబోయినా వినకుండా తన గదిలో కెళ్ళి తలుపేసుకుంది.

యిది జరిగి వారం దాటాక ఓ రోజు జాస్మిన్ నోటు పుస్తకంలోని రాతలు చూసి

క్రిస్టీ భయపడిపోయింది... బెంగ పడిపోయింది.

ఆ నోటు పుస్తకంలో... 'అమ్మ చాలా చెడ్డది... నన్ను కని నిర్దయగా పారేసి వెళ్ళిపోయిన ఆడది అమ్మెలా అవుతుంది? రాక్షసి...' అని ఓ పేజీలో రాసి ఉంది. మరో పేజీలో ఓ స్త్రీ బొమ్మ గీసి దాని కింద 'అమ్మ' అని రాసింది. ఆ స్త్రీ గుండెల్లో కత్తి దిగబడి ఉంది. దాని కింద 'యిలాంటి అమ్మల్ని చంపేయాలి' అని రాసి ఉంది.

రాత్రి భోజనాలయాక జాస్మిన్‌ని తన పక్కన కూచోబెట్టుకుని "నువ్వు అమ్మ గురించి నోట్‌బుక్‌లో రాసుకున్న అభిప్రాయాలు చదివాను. నీ ఆలోచనలు సవ్యంగా లేవు తల్లీ" అంది.

"ప్లీజ్ మమ్మీ... ఆమె గురించి మాట్లాడటం నాకిష్టం లేదు. క్రూయల్ ఉమన్"

"అలా అనుకోవటం తప్పు. నిజానిజాలు దేవుడికే తెలియాలి. నిన్నలా వదిలేయడం వెనుక ఎన్ని కారణాలున్నాయో తెలీకుండా ఆ వ్యక్తిని అపరాధిలా చూడటం సమంజసం కాదు. ఏ స్త్రీకయినా మాతృత్వంలోనే అస్తిత్వం దాగి ఉంటుంది. పిల్లలకోసం ఆడది ఎంతగా తపిస్తుందో ఏ గొడ్రాలి గుండె తడిమినా అర్థమౌతుంది. మీ అమ్మ నిన్ను వదిలి వెళ్తున్నప్పుడు తన హృదయాన్ని వదిలేసి వెళ్తున్నట్టే బాధ పడి ఉంటుంది. ఒక్కటి గుర్తు పెట్టుకో తల్లీ. ప్రపంచంలో దుర్మార్గులైన ఆడవాళ్ళుంటారేమో కాని దుర్మార్గపు తల్లి ఉండదు. నీ తల్లి నిన్ను ప్రేమించి ఉంటుంది. యిప్పటికీ ప్రేమిస్తూ ఉంటుంది. సాటి ఆడదానిగా చెప్తున్నాను. నన్ను నమ్ము. కారణాలు తెలీకుండా ఎవ్వర్నీ ద్వేషించకు. నీ జన్మకు కారణమైన తల్లి విషయంలో కృతజ్ఞతగా ఉండాలని కదా బైబిల్ చెప్తుంది"

"మరి నన్ను అలా వదిలేసింది నాకు కాళ్ళు లేవనే కదమ్మా"

"నువ్వింకా చిన్నపిల్లవి. నీకు తెలీని లోకం చాలా ఉంది తల్లీ. అన్ని అవయవాలూ సక్రమంగా ఉన్నా ఆడపిల్ల పుడితే పెంచటం,పెళ్ళి చేయటం భారమని తలచి పురిట్లోనే చంపేసుకుంటున్న కడుపేద తల్లిదండ్రులున్న దేశం మనది.నిన్ను కన్నతల్లి అలా చేసి ఉంటే నువ్వంటూ మాకు దక్కేదానివి కాదు. తానివ్వలేని మంచి జీవితం నీకు దొరకాలనే మీ అమ్మ నిన్నలా వదిలేసిందేమో... నిజం చెప్పు... నీకు జీవితంలో ఏం లోటుంది చెప్పు"

అమ్మ చెప్పే మాటల్లోని అర్థం, ఆంతర్యం జాస్మిన్‌కి మెల్లగా బోధ పడింది.

* * *

ఒంగోలు పట్టణం... సాయంత్రం ఆరు గంటల సమయం...

సాయిబాబా గుడిలో ప్రదక్షిణాలు చేసొచ్చి చలువరాతి బండలమీద గోడకానుకుని కూచుంది రాజ్యం.

గుళ్లోకి వస్తున్న జనాల్ని చూస్తూ కూచున్న రాజ్యం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. గుండెలోని ఏ పొరల్లోనో యిన్నాళ్ళుగా దాచుకున్న పాత గాయమేదో కలుక్కుమంది. మనసంతా అలజడి... పిండేస్తూ బాధ... అంత ఘోరం తనెలా చేయగలిగిందీ... తన మనసెలా ఒప్పిందీ... తనకసలు హృదయమనేది ఉందా... పాషాణం... తనో కిరాతకురాలు. తన పాపానికి నిష్కృతి లేదు. ఎంతమంది దేవుళ్ళని ఎన్నిసార్లు మొక్కినా తనకు క్షమాపణ దొరకదు.

కన్నీళ్ళ ప్రవాహమై మరోసారి అతని వైపు చూసింది. పదిహేను పదహారేళ్ళ కుర్రాడు. పల్చగా ఉన్నాడు. కాళ్ళు రెండూ పూచిక పుల్లల్లా ఉన్నాయి. చేతుల ఆసరాతో నేలమీద దేక్కుంటూ గుళ్లోకి వస్తున్నాడు. వాళ్ళమ్మ కామోసు అతనిపక్కన నడుస్తోంది.

పదహారేళ్ళ క్రితం తను అమానుషంగా వదిలేసిన కూతురు గుర్తొచ్చి గర్భకోశంలో ఏదో మడత పడ్డట్టు విలవిల్లాడింది రాజ్యం. యిపుడా పాప ఎలా ఉందో... ఎవరి దగ్గర ఉందో... అసలుందోలేదో.. ఆ ఆలోచనకే వళ్ళు జలదరించింది.

పాప పుట్టిన క్షణం నుంచీ తన భర్తలో దాక్కొన్న రాక్షసుడు మేల్కొన్నాడు. గొంతు పిసికి చంపేస్తానంటాడు. పిల్ల అలా పుట్టినందుకు దుఃఖం ఓ వైపు, తన భర్త నిజంగానే చంపేస్తాడేమోనన్న భయం మరో వైపు... ఎంత నరకం అనుభవించిందో దేవుడికే తెలియాలి. అర్నెల్లు కళ్ళల్లో వత్తులు వేసుకుని పిల్లని కాపాడుకుంది. తాగొచ్చి గొడ్డుని బాదినట్టు బాదినా సహించింది.

ఓ రోజు బాగా తాగి తూలుకుంటూ యింటికొచ్చాడు.

కూరలు తరిగే కత్తి పట్టుకుని పాప దగ్గరకొస్తుంటే తను అడ్డుపడింది.

'నీకేమైనా పిచ్చా... పసిగుడ్డుని చంపుతానంటావే... నువ్వసలు మనిషివేనా' అంటూ అతన్తో కలబడింది.

'ఆడపిల్లను కంటమే నువ్వు చేసిన తప్పు. అందులోనూ కాళ్ళు లేని అవిటిదాన్ని

కని పడేస్తే దాన్నెవడు పోషిస్తాడే నీ బాబు... దాన్ని పెళ్ళెవరు చేసుకుంటారు? జీవితాంతం దాన్ని మోస్తూ తిరగటం నావల్ల కాదు. చంపేస్తే పీడా వదిలి పోతుంది' అన్నాడు.

'నేను మోస్తానయ్యా... మన బిడ్డ మనకు బరువా చెప్పు. దేవుడు దాన్నలా పుట్టిస్తే అదేం చేస్తుందయ్యా? బిడ్డ చూడు ఎంతందంగా ఉందో... దాని కళ్ళు చూడు ఎంత పెద్దగా ఉన్నాయో... చూస్తేనే కడుపు నిండిపోతుందయ్యా.. దాని కాళ్ళు చూస్తే కడుపు తరుక్కుపోతుందయ్యా... కార్పెంటర్‌గా నీకొచ్చే సంపాదన మనకు చాలటం లేదని నాకు తెలుసు. దాన్ని సాకడానికి నువ్వేం కష్టపడక్కరలా... నేను కూలి పనైనా చేసి దాన్నిపోషించుకుంటా' అంటూ కాళ్ళు పట్టుకుంది.

'ఛత్. నీ సంపాదన ఎవడిక్కావాలే... అసలు దాని మొహం చూడటమే పాపం. నా కళ్ళెదురుగా ఆ దెయ్యపు పిల్ల ఉంటానికి వీల్లేదు. నేను బైటికెళ్ళి గంటలో వస్తా. దాన్ని చంపి బైట పడేయి. లేదా దాంతోపాటు నీ రెండేళ్ళ కొడుకుని కూడా చంపేస్తా' అంటూ మరోసారి తాగడానికి బైటికెళ్ళాడు.

తన భర్త అన్నంత పనీ చేసే కసాయివాడని తెలుసు. రెండేళ్ళ తన బాబు వైపు చూసుకుంది. వాడు ఆదమరిచి నిద్రపోతున్నాడు. పాప వైపు చూసింది. నిద్రలోనే పాలు తాగుతున్నట్లు పెదవుల్తో చప్పుడు చేసింది. గుండెని రాయి చేసుకుని పాపనెత్తుకుని బయల్దేరింది. రాత్రి తొమ్మిది గంటల సమయం...

జక్రయ్య ఆస్పత్రి కన్పించగానే తనకో ఆలోచన వచ్చింది. పాపనక్కడ వదిలేస్తే ఏ పుణ్యాత్ములో పెంచుకుంటారు. పాప ఎక్కడ ఉన్నా ఎవరి దగ్గర ఉన్నా బతికుంటే చాలు.

డాక్టర్‌గారు పేషంట్లను చూసే గదిని సమీపించింది. రోగుల్ని చూసేది ఎనిమిదింటి వరకే కాబట్టి అక్కడా సమయంలో ఎవ్వరూ లేరు. పాపను పాతచీరలో భద్రంగా చుట్టి అక్కడ గచ్చునేలమీద పడుకోబెట్టి వేగంగా బైటికొచ్చేసింది.

అంతే... ఆ క్షణం నుంచీ దహించి వేస్తూ పాపభీతి..మరునాడు వెళ్ళి పాప ఏమైందో వాకబు చేద్దామనుకుంది. ఎవరికైనా అనుమానం వస్తుందన్న భయంతో గమ్మునుండిపోయింది. అనంతమైన అలజడిని మాత్రం గుండెల్లో దాచుకుంది.

పక్కన అలికిడైతే ఆలోచనల్లోంచి బైటపడి చూసింది. దర్శనం చేసుకుని వచ్చినట్టున్నారు ఆ తల్లీ పిల్లవాడు... తనకు దగ్గరగా కూచున్నారు.

"చేతులు నొప్పెడుతున్నాయా నాన్నా.. కొద్ది సేపు నా వొళ్ళో పడుకుంటావా... యిండ ప్రసాదం తిను" అంటూ పదహారేళ్ళ కుర్రవాణ్ణి పసిపాపలా లాలిస్తున్న ఆ తల్లిని చూడగానే రాజ్యం పక్కకు తిరిగి వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

జాస్మిన్ యింటర్ పాసై ఐ.ఐ.టిలో సీట్ తెచ్చుకుంది. ఆ రోజు యింట్లో చిన్న పార్టీ ఏర్పాటు చేసింది క్రిస్టీ. రెండేళ్ళ క్రితం గుండెనొప్పితో చనిపోయిన భర్త గుర్తుకు రాగానే ఆమె కళ్ళు చెమర్చాయి. బతికుంటే కూతురి ప్రతిభ చూసుకుని ఎంతగా మురిసిపోయేవాడో... తనకు బ్యాంక్ మేనేజర్‌గా పదోన్నతి వచ్చినా కూతుర్ని చూసుకోడానికి సమయం సరిపోదని కాలదన్నుకుంది. యింకా రెండేళ్ళ సర్వీస్ మిగిలి ఉంది. రిటైరైనాక పూర్తికాలాన్ని జాస్మిన్ కోసం వినియోగించాలన్న కోరిక... జాస్మిన్ పెద్ద ఉద్యోగస్థురాలైతే చూసి సంతోషించాలన్న కోరిక.

పార్టీ ఐపోయి అందరూ వెళ్ళిపోయాక కూతురి వైపు మురిపెంగా చూస్తూ అడిగింది. "ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది తల్లీ. నీకు గిఫ్ట్ యివ్వాలనుకుంటున్నా. ఏం కావాలో అడుగు"

"ఏమడిగినా యిస్తావా?"

"ష్యూర్... ఎనీథింగ్ యిన్ దిస్ వరల్డ్... ఫర్ మై లవ్లీ చైల్డ్"

"తీరా అడిగాక ఏమనుకోవుగా"

"నెవర్. అడుగు ఏం కావాలో"

"నాకు ఒంగోలు వెళ్ళి అమ్మను చూడాలని ఉందమ్మా" అంది జాస్మిన్.

క్రిస్టీ మౌనంగా ఉండటం చూసి "కోపం వచ్చిందా అమ్మా" అని అడిగింది.

"లేదు తల్లీ. యిన్నాళ్ళకైనా నీకలాంటి ఆలోచన వచ్చినందుకు సంతోషంగా ఉంది" కూతురి వైపు ప్రేమగా చూస్తూ అంది క్రిస్టీ.

* * *

ఒంగోల్లో మౌర్యా హోటల్ రూం.

ఆర్నెల్ల వయసులో తీసిన జాస్మిన్ ఫొటోనొకదాన్ని పేపర్లకిచ్చి అసలు తల్లిదండ్రులు వచ్చి హోటల్ రూంలో తనను కల్సుకోవల్సిందిగా ప్రకటన విడుదల చేసి రెండ్రోజులు దాటినా ఎవ్వరూ రాకపోతే జాస్మిన్ కన్నా క్రిస్టీనే ఎక్కువ నిరాశకు లోనైంది. రేపు మరలా కేరళకు తిరుగు ప్రయాణం... తన కూతురి కోరిక తీర్చలేకపోయినందుకు ఆమెకు దిగులుగా ఉంది. రాత్రి భోజనాలప్పుడు అన్నం సయించలేదు. "సారీ బేబీ" అంది జాస్మిన్‌తో. 'పర్లేదులే మమ్మీ' అన్నట్లు తడి కళ్ళతో సమాధానం చెప్పింది జాస్మిన్.

పడుకోబోయే ముందు ప్రేయర్ చేస్తున్నప్పుడు కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీయగానే రాజ్యం లోపలికొచ్చి మంచంమీద కూచుని ఉన్న జాస్మిన్‌ని కళ్ళారా చూసుకుంది. "నేనేనమ్మా నీ దౌర్భాగ్యపు తల్లిని. నన్ను క్షమించు" అంది. జాస్మిన్‌కి తెలుగు రాదు. ఆమె మాట్లాడిన భాష అర్థంకాలేదు. కానీ భావం అర్థమైంది.

తన ఎదురుగా నిలువెత్తు అపరాధ భావనలా తల దించుకుని నిలబడి ఉన్న తల్లిని చూడగానే జాస్మిన్ వేగంగా చక్రాల కుర్చీలోకి మారి ఆమెను సమీపించి, నడుం చుట్టూ చేతులేసి దగ్గరకు లాక్కుని, మొహాన్ని కడుపులో దాచుకుంది.

"నన్నెందుకు పారేశావు మమ్మీ? నేనేం తప్పు చేశానని? ఈ మమ్మీ ఆదరించి ఉండకపోతే నా బతుకేమయ్యేది? అనాథలా... దుర్భరమైన బతుకు బతకాల్సి వచ్చేది. నన్నలా ఎవరి దయాదాక్షిణ్యాలకో వదిలేసి వెళ్ళడానికి నీకు మనసెలా ఒప్పిందమ్మా?" యిన్నాళ్ళుగా తన గుండెల్లో శూలాల్లా గుచ్చుకుంటున్న ప్రశ్నల్ని కన్నీళ్ళతో తడిపి ముద్దచేసి మళయాళంలో కుమ్మరిస్తోంది జాస్మిన్.

రాజ్యానికి తన కూతరు మాట్లాడే భాష అర్థం కాకున్నా, ఆ అమ్మాయి పడ్తోన్న వేదన అర్థమౌతోంది.

"నిన్ను వదిలేసి చాలా తప్పు చేశాను తల్లీ. యిన్నాళ్ళూ ఎంతటి మానసిక క్షోభని అనుభవించానో నాకు తెలుసు, ఆ పైనున్న దేవుడికి తెలుసు. కసాయివాడైన నా మొగుణ్ణి ఎదిరించే ధైర్యం ఆనాడు లేకపోయింది. యిపుడు నాకు తోడుగా చెట్టంత ఎదిగిన నా కొడుకున్నాడు. నాతో పాటు నిన్ను తీస్కెళ్ళడానికే వచ్చాను. నీ దుర్మార్గపు తండ్రి నోరెత్తాడా, ఎడం కాల్తో తన్ని బైటికి గెంటేస్తాను. నాతో పాటు వచ్చేయి తల్లీ... నాకున్నంతలో నీకేలోటు రాకుండా చూసుకుంటాను" అంది రాజ్యం.

క్రిస్టీకి ఆమె ఏమంటుందో అర్థం కాకున్నా పశ్చాత్తాపపడ్తున్న విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

రాజ్యం క్రిస్టీ వైపు తిరిగి, "నా కూతుర్ని యిన్నాళ్ళూ సాకినందుకు ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేను" అంటూ ఆమె కాళ్ళని చుట్టుకుని వాటిని తన కన్నీళ్ళతో కడిగింది.

క్రిస్టీకి ఆమెను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఆమెకు తెల్సిన మూడు భాషలు రాజ్యానికి తెలీవు. రాజ్యానికి తెల్సిన భాష ఆమెకర్థం కాదు. ఈ సమయంలో తన చెల్లెలే ఉండి ఉంటే చాలా బావుండేదనిపించింది. జక్రయ్య ఆస్పత్రిలో సర్సుగా చాలా సంవత్సరాలుగా పని చేయటం వల్ల ఆమెకు తెలుగూ, మళయాళం రెండూ వచ్చు కాని ఏడాది క్రితమే ఉద్యోగాన్ని వదిలేసి కేరళకెళ్ళిపోయింది.

రాజ్యం లేచి జాస్మిన్ చేతులు పట్టుకుని "పద తల్లీ వెళ్దాం.. నిన్ను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటాను" అంది. క్రిస్టీ వైపు తిరిగి, "యిన్నాళ్ళూ మీరు దాని ముద్దూ ముచ్చట చూశారుగా. యికనుంచి దాని బాధ్యతంతా నేను మోస్తాను. కాదనకండి" అంటూ కన్నీళ్ళతో వేడుకుంది.

జాస్మిన్‌కి తన కన్నతల్లి ఏమడుగుతుందో ఆమె ముఖ కవళికల్ని బట్టి, హావభావాల్ని బట్టి అర్థమైంది. క్రిస్టీ వైపు 'ఏమంటావు' అన్నట్టు చూసింది. తనని కడుపులో మోసి కనకున్నా యిన్నాళ్ళూ కడుపులో పెట్టుకుని కాపాడిన తల్లి...

క్రిస్టీ కళ్ళతోనే 'నీ యిష్టం తల్లీ' అంది. కానీ ఆమె కన్నీళ్ళు మాత్రం 'నాకు నువ్వు తప్ప ఎవరున్నారు తల్లీ ...నువ్వు లేకుండా నేను బ్రతగ్గలనా' అంటున్నాయి.

జాస్మిన్ వెంటనే ఓ నిర్ణయానికొచ్చింది. "నిన్ను చూడాలన్న కోరికతో వచ్చాను తప్ప నీతో ఉండిపోవాలని రాలేదమ్మా. ఈ అమ్మనొదిలి రాలేను. ఏమీ అనుకోకు. నీకు తోడుగా అన్నయ్య ఉన్నాడు. నా తండ్రి తోడున్నాడు. ఈ అమ్మకెవరున్నారు? నేను తప్ప ఎవ్వరూ లేరు" అంది.

తన కూతురి మాటలు వినగానే క్రిస్టీ ఒక్క ఉదుటున లేచి జాస్మిన్ని కౌగిలించుకుని బిగ్గరగా ఏడ్చింది.

రాజ్యానికి తన కూతురు రానంటున్న విషయం అర్థమైంది. తన కూతురు ఆ

అమ్మ దగ్గర ఉండటమే మంచిదనిపించింది. తనైతే యింత బాగా చదివించగలిగేదా? యిన్ని సౌకర్యాలు కల్పించగలిగేదా?

"సరే తల్లీ. నువ్వీ అమ్మ దగ్గిరే ఉండు. నన్ను మాత్రం మర్చిపోకు. నామీద కోపం, ద్వేషం పెట్టుకోకు తల్లీ. మగవాడిమీద ఆధారపడిన ఆడదని బతుకు నాది... బానిస బతుకు. నన్ను క్షమించానని ఒక్కసారి అను తల్లీ" అంది.

జాస్మిన్ చేతులు చాపింది. క్రిస్టీతో పాటు రాజ్యం కూడా జాస్మిన్ని చుట్టుకుని కన్నీటి చెలమయ్యింది.

ఆ గదిలోని ముగ్గురూ ఏడుస్తున్నారు. వాళ్ళ కన్నీళ్ళకు భాషుంది. మనసున్న ప్రతివాడికీ అర్థమయ్యే భాష... అది పేగుబంధం భాష... ప్రేమ బంధం భాష...